ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జగిత్యాల

జిల్లా వార్తలు

5★★

బుధవారం 27 నవంబరు 2024



ప్రజలకు చేరువయ్యేలా విధులు నిర్వహించాలి

జగిత్యాల రూరల్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ అశోక్‌కుమార్



రూరల్‌స్టేషన్‌లో వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాలరూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మరింత చేరువయ్యేలా పోలీసు విధులు ఉండాలని ఎస్పీ అశోక్‌కుమార్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం జగిత్యాల రూరల్ స్టేషన్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. ఈసందర్భంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై రివ్యూ చేశారు. కేసుల నమోదు శాంతిభద్రతలకు సంబంధించిన విరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజాసమస్యలపైన వెంటనే స్పందిస్తూ బాదితులకు సత్వర న్యాయం జరిగే విధంగా భరోసా కల్పించాలని అన్నారు. పోలీస్‌శాఖ నూతన టెక్నాలజీ ఉపయోగిస్తున్నదాని గురించి అధికారులకు సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. ఈకార్యక్రమంలో డీఎస్పీ రఘుచందర్, సీఐ కృష్ణారెడ్డి, ఎస్సైలు సధాకర్, దత్తాత్రి, కుమారస్వామి, సతీస్, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పరిశీలన

ధర్మపురి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సమగ్ర కుటుంబ సర్వే సంబంధించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానికసంస్థలు) గౌతంరెడ్డి మంగళవారం పరిశీలించారు. ఆయన వెంట ధర్మపురి ఎంపీడీవో రవీందర్, ఎంపీవో నరేష్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ ఏకేరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ మహేష్, నరేష్ పాల్గొన్నారు.

రూ. 391.37 కోట్ల ధాన్యం కొనుగోళ్లు

అదనపు కలెక్టర్ లత

జగిత్యాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటివరకు రూ. 391.37 కోట్ల విలువ గల ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి కొనుగోలు చేశామని జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 424 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 1,68, 695 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 29, 229 మంది రైతుల వద్ద నుంచి కొనుగోలు చేశామన్నారు. ఇందుకుగాను 1,30, 125 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించిన రూ. 301.89 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 22, 494 మంది రైతులకు లబ్ధి చేకూరుందని వివరించారు.

బాలికల్లో ఆత్మరక్షణకు కసరత్తులు



- విద్యార్థినుల్లో ఆత్మస్థయిర్యం పెంచేందుకు కరాటే శిక్షణ
- సెల్ఫ్ డిఫెన్స్ కోసం పాఠశాల నుంచే మెళకువలు
- జిల్లా వ్యాప్తంగా 206 పాఠశాలల్లో... సుమారు 9,500 మంది బాలికలకు

జగిత్యాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బాలికల్లో ఆత్మ స్థయిర్యం పెంచేందుకు సర్కారు పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం కరాటే శిక్షణను నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వం రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ శిక్షణ కార్య క్రమాన్ని చేపడుతోంది. అమ్మాయిలపై దాడులు, అత్యా చారాలు ఎదుర్కొనేందుకు బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. జిల్లాలో ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్ కోసం పాఠశాల స్థాయి నుంచే ఉచితంగా కరాటేలో శిక్షణ ఇస్తున్నారు.

జిల్లాలో 206 ప్రభుత్వ పాఠశాలల్లో...

జిల్లాలోని 206 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూల్స్, కస్తూర్బా పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలను ఈపథకం కిందట ఎంపిక చేశారు. ఈనెల 20వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేయబడిన పాఠశాలల్లో బాలికలకు శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించారు. దాదాపు 9,500 మంది బాలికలకు మూడు నెలల పాటు ఉచితంగా కరాటే శిక్షణ ఇచ్చేందకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ శిక్షణ ద్వారా శారీరక ధృడత్వంతో పాటు ఏకాగ్రత అలవడనుంది.

మిగతా 8వ పేజీలో..

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



వంట పదార్థాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

మెట్‌పల్లిటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆరోగ్యం, ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బి.సత్యప్రసాద్ గురుకుల పాఠశాల సిబ్బందిని హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని ఆరపేటలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో తరగతి గదులను, వంటశాలను, స్టోర్‌రూంను తనిఖీ చేశారు. భోజనం మెను ప్రకారం అందించాలన్నారు. ప్యూరిఫైడ్ మరమ్మతులను వెంటనే చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ టి. మోహన్ పాల్గొన్నారు.

సీఎం వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ హాజరు

జగిత్యాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళవారం హైద్రాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ సత్య ప్రసాద్, ఇతర అధికారులు హాజరయ్యారు. పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పలు అంశాలపై ఆదేశాలు, సలహాలు, సూచనలు ఇచ్చారు. ధాన్యం కొనుగోళ్లతో పాటు పలు అంశాలను అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డి, పౌరసరఫరా శాఖ అధికారులు, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

● ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవీఎం) ట్యాంపరింగ్ చేయడం అసాధ్యమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సత్య ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఎన్నికల వ్యవస్థలో ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ పేపర్ ఓటింగ్ నిర్వహించాలన్న ప్రజాహిత వాజ్య పిటిషన్లకు సమాధానం ఇస్తూ అన్ని పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసిందన్నారు.

ఆకట్టుకున్న నాట్య ప్రదర్శన

జగిత్యాల క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని మిషన్ కాంపౌండ్‌లో ఉన్న సీఎస్ఎస్ చర్చ్‌లో ఏసు క్రీస్తు జన్మ వృత్తాలకు సంబంధించిన ప్రత్యేక నాటిక భక్తులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సపోస్ క్రిస్ మస్ సంబరాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రత్యేక గీతాలపనలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ గురువు జీవరత్నం తదితరులు ఉన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

రాయికల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. రా జ్యాంగ దినోత్సవం సందర్భంగా రాయికల్ పట్టణంలో మంగళవారం ఎమ్మెల్యే అంబే ద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, సామూహిక ప్రతిజ్ఞలో పాల్గొన్నారు. పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఎంపీడీవో చిరంజీవి, పీఆర్ ఏఈ ప్రసాద్, ఎంపీవో సుష్మా, పీఏసీఎస్ చైర్మన్ రాజలింగం, పాల్గొన్నారు.

●రాయికల్ పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని గనంగా నిర్వహించారు.

జగిత్యాలరూరల్ : జగిత్యాల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం జగిత్యాల మండలంలోని అంబారిపేట్ గ్రామంలో రూ.2 కోట్లతో నిర్మిస్తున్న ఫారెస్ట్ పార్కు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం జగిత్యాల రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. జిల్లా సంక్షేమశాఖ అధికారి నరేష్, తహసీల్దార్ నరేష్, ఎంపీడీవో రమాదేవి, డీఈ మిలింద్, సీడీపీవో మమత, ఏపీఎం గంగాధర్ పాల్గొన్నారు.

బీర్‌పూర్: మండలంలోని నర్సింహులపల్లి గ్రామం పరిధిలోని ఇందిరానగర్‌లో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ గ్రామ పంచాయతీ భవణ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఇందిరానగర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల ను నెరవేర్చడానికే అధికార పార్టీవైపు వైపు వెళ్లాల్సి వచ్చిందన్నారు. ఈ కార్యక్ర మంలో తహసీల్దార్ ముంతాజుద్దీన్, ఎంపీడీవో లచ్చాలు పాల్గొన్నారు.

కల్లెడ పశువైద్యాధికారి బాధ్యతల స్వీకరణ

జగిత్యాలరూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) :జగిత్యాల రూరల్ మండలం కల్లెడ పశువైద్యకేంద్రం వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌గా డాక్టర్ వాసు పావని మంగళవారం బాధ్యతలు చేపట్టారు. వాసుపావనికి జగిత్యాల ఏరియా ప్రధాన పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ మదన్‌మోహన్‌రావు, వెటర్నరీలైవ్‌స్టాక్ అధికారి కందుకూరి పూర్ణచందర్, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ రవీందర్ శుభాకాంక్షలు తెలిపారు.

డాటా ఎంట్రీ పకడ్బందీగా చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్
- సర్వే ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ఆకస్మిక తనిఖీ

8



డాటా ఎంట్రీని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

ఇదేం మధ్యాహ్న భోజనం..

- గురుకులంలో వంటపై ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆగ్రహం
- అల్లీపూర్ పాఠశాల ఆకస్మికంగా తనిఖీ
- భోజన నిర్వహణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

8



వంట గదిని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కుటుంబ నియంత్రణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కుటుంబ నియంత్రణ శిబిరాలను అర్హులైన దంపతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య శాఖ ఆద్వర్యంలో కుటుంబ నియంత్రణ శిబిరాన్ని నిర్వహించారు. 36 మందికి కోత, కుట్టు లేని వెసెక్టమి ఆపరేషన్లు చేశారు. ఆపరేషన్లు చేయించుకున్న వ్యక్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ నియంత్రణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జైపాల్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో ఎన్ శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీనివాస్, ఎన్ఎస్‌వీ సర్జన్ డాక్టర్ యాకూబ్ పాషా పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి

బీర్‌పూర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు వేగవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ బిఎస్ లత అన్నారు. మంగళవారం బీర్‌పూర్ మండల కేంద్రం లోని ఐకేపీ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లలో వెగం పెంచాలన్నారు ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ముంతాజుద్దీన్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐలు శ్రీనివాస్, రాహుల్ ఉన్నారు.

ప్రజాపాలనతో గ్రామాల అభివృద్ధి

చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం

కొడిమ్యాల, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలనతోనె గ్రామాలు అభివృద్ధి చెందుతాయని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యంఅన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని పూడూర్ గ్రామ ప్రాథమిక పాఠశాల ఆవరణలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పల్లె అభివృద్ధికి 2750కోట్ల రూపాయలను కేటాయించిందన్నారు. 12 లక్షల రూపాయలతో అంగన్‌వాడీ భవనాన్ని నిర్మిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూప, కార్యదర్శి రాంకిషన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నారాయణ గౌడ్, మల్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి, చొప్ప దండి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు ముత్యం శంకర్ గౌడ్, పీసీసీ సభ్యుడు మహిపాల్‌రెడ్డి, కేంద్ర సహకార బ్యాంక్ మాజీ డైరెక్టర్ మల్లిఖార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏడాదిలో ఇచ్చిన హామీలు నెరవేర్చాం

ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న అడ్లూరి లక్ష్మణ్ కుమార్

ధర్మపురి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చి ముందుకు సాగుతుందని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ధర్మపురి మండలంలోని దొంతాపూర్ గ్రామంలో ఎంజీఎన్ ఆర్ఈజీఎస్ పథకం రూ 12 లక్షలు నిధులతో నూతనంగా నిర్మించే అంగన్‌వాడి భవనానికి, గాదెపల్లి గ్రామంలో రూ 20 లక్షల నిధులతో నిర్మించే గ్రామపంచాయతీ భవనానికి మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్నప్రాసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ధర్మపురి ఏఎంసీ చైర్ పర్సన్ చిలుముల లావణ్య-లక్ష్మణ్, పీఆర్ ఈఈ ఎండీ రహమాన్, డీఈఈ గోపాల్, ఏఈఈ ముకరం, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుధాకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు రాజేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శైలజ, ఏఎంసీ వైస్ చైర్మన్ నర్సింహులు, పాల్గొన్నారు.

పెగడపల్లి : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. పెగడపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ఏడు మోటలపల్లి తండా వరకు రూ. 2 కోట్లతో నిర్మించనున్న రోడ్డు నిర్మాణ పనులకు, పెగడపల్లిలో, నామాపూర్‌లో అభివృద్ధి పనులకు మంగళవారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శంకుస్థాపనలు చేశారు. విద్యుఘాతంతో మరణించిన సిద్దుల గంగయ్య కుటంబానికి మంజూరైన ఆర్థికసాయం రూ. 5 లక్షలు, ముగ్గురికి కళ్యాణ లక్ష్మీ పథకంలో మంజూరైన చెక్కులను లక్ష్మణ్ కుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమాలలో పంచాయతీ రాజ్ ఈఈ రహమాన్, మండల ప్రత్యేకాధికారి మనోహర్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్, ఎం పీవో మహేందర్, డీఈఈ అశ్విన్ పాల్గొన్నారు.

బుగ్గారం: నిరంతరం ప్రజలకు అందుబాటులో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఈ మేరకు మండలం లోని యశ్వంతరావు పేట గ్రామంలో నిర్మించనున్న నూతన అంగన్వాడి భవన నిర్మాణానికి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శంకుస్థాపన చేశారు. కార్యక్ర మంలో మండల అధ్యక్షుడు వేముల సుభాష్, ఉపాధ్యక్షుడు నగునూరి నర్సా గౌడ్, కాంగ్రెస్ నాయకులు తాండ్ర సత్యనారాయణరావు, గంగాపూర్ సుభాష్, బండారి మహేష్, అంగన్వాడి సూపర్ వైజర్ విజయలక్ష్మి, పాల్గొన్నారు.

ఎండపల్లి: సూరారం నుంచి గోపాల్‌రావుపేట గ్రామం వరకు రెండు కోట్ల ముప్పై లక్షల వ్యయంతో బీటి రోడ్డు, బ్రిడ్జి నిర్మానానికి మండలంలోని సూరారం గ్రామంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మంగళవారం శంకుస్థాపన చేశారు. మండల అధ్యక్షులు తాటిపర్తి శైలెందర్ రెడ్డి. నాయకులు మద్దుల గోపాల్ రెడ్డి, జితెందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

● గుళ్ళకోటలో ఏర్పాటు చేసిన మీ సేవా కేంద్రాన్ని అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రారంభించారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలి

కోరుట్ల రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధిపై గ్రామస్థులు దృష్టా సారించాలని పంచాయితీరాజ్ జిల్లా అధికారి రఘు వరన్ అన్నారు. మంగళవారం మండలంలోని పైడిమడుగు గ్రామంలో ప్రజాపాలన విజమోత్సవ కార్యక్రమంలో భాగంగా భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహిం చారు. రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞను గ్రామస్థులతో కలిసి చేశారు. గ్రామంలో ఉపాధి హామీ పనిలో నిర్మాణం చేస్తున్న కోళ్ల ఫారంను అధికారులు గ్రామస్థులతో కలిసి ప్రారంభించారు. పారిశుధ్య కార్మికులను గ్రామస్థులు, గ్రామ స్థాయి అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమాలలో ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో కృపాకర్, మండల వ్యవసాయ అదికారిణి నాగమణిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తేనే నాయకుడిగా గుర్తింపు

● వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

కథలాపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించినప్పుడే సమాజంలో నాయకునిగా గుర్తింపు లభిస్తుందని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. మండల కేంద్రంలో రు. 1.30 కోట్లతో మోడల్ స్కూల్ రోడ్డు నిర్మాణం, తక్కళ్లపల్లి-దూలూరు గ్రామాల మధ్య రు. 85 లక్షలతో నిర్మించనున్న కాజ్‌వే నిర్మాణ పనులకు మంగళవారం భూమిపూజ చేసిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సిరికొండలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరుతో పాటు ప్రధాన సమస్యగా ఉన్న సూరమ్మ చెరువు పనులు ప్రారంభించుకో వడం గొప్ప అనుభూతి కలుగుతోందని తెలిపారు వేములవాడకు అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) కోసం ప్రభుత్వం రు. 42 కోట్లు కేటాయించిందని దీంతో భవిష్యత్‌లో యువకు ఉపాధి లభించే అవకాశాలు మెండుగా ఉన్నాయని చెప్పారు. జూనియర్ కళాశాలకు ప్లేగ్రౌండ్, ప్రహరీ గోడ నిర్మించడానికి కృషి చేయాలని ప్రిన్సిపాల్ నారాయణ ఎమ్మె ల్యేకు విన్నవించారు. ఎంపీడీవో శంకర్, తహసీల్దార్ వినోద్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ మమత, ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, వైస్ చైర్మన్ పులి శిరీషహరిప్రసాద్, పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, నియోజకవర్గ ఎన్ఎస్‌యుఐ కన్వీనర్ ఆకుల సంతోష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


నరేందర్(ఫైల్)

కరీంనగర్ క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం నగనూర్ గ్రామ శివారులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫుడ్ డెలివరీ బాయ్ దుద్దెడ నరేందర్(34) దుర్మరణం చెందాడు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం సోమారంపేటకు చెందిన నరేందర్ కరీంనగర్ భగత్‌నగర్‌లో అద్దె ఇంటిలో భార్యపిల్లలతో నివాసం ఉంటున్నాడు. నరేందర్ రాత్రి 11 గంటల సమయంలో కరీంనగర్ నుంచి నగనూర్‌కు ఫుడ్ తీసుకువెళ్లి తిరిగి బైక్‌పై వస్తుండగా వెనుక నుంచి మరో బైక్ ఢీకొట్టింది. దీంతో నరేందర్ బైక్‌పై నుంచి ఎగిరి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కొడుకు, కూతురులున్నారు. ఫుడ్ డెలివరీబాయ్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న నరేందర్ మృత్యువాత పడటంతో ఆ కుటుంబం రోడ్డున పడిందని, ప్రభుత్వం ఆదుకోవాలని మృతుడి బంధువులు విజ్ఞప్తి చేశారు. ప్రమాదానికి కారణమైన బైక్‌పై ఉన్న వ్యక్తి స్థానిక నగునూర్ వైద్యకళాశాల విద్యార్థి కామినేని యువ రాంచందర్‌గా మృతుడి కుటుంబ సభ్యులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు.

అగ్ని ప్రమాదంలో గాయపడిన ఏఎస్సై మృతి


రామస్వామి(ఫైల్)

కరీంనగర్ క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో ఈనెల 17న జరిగిన అగ్నిప్రమాదంలో కాలిన గాయాలతో హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కరీంనగర్ సీసీ ఆర్‌బీలో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ రామస్వామి మంగళవారం మృతిచెందాడు. కరీంనగర్‌లోని ఇంటిలో గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో రామస్వామి, అతడి భార్య గాయపడ్డారు. తీవ్ర గాయాలతో ఉన్న రామస్వామిని కరీంనగర్‌లో ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ 9రోజుల పాటు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. రామస్వామి కొడుకు కూడా కొన్ని సంవత్సరాల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించాడు. రామస్వామి మృతి పట్ల పలువురు పోలీసు అధికారులు సంతాపాన్ని వెలిబుచ్చారు.

దొంగతనం కేసులో
ఇద్దరికి ఎనమిది నెలల జైలు శిక్ష

వేములవాడ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో ఇద్దరికి 8 నెలల జైలు శిక్షతో పాటుగా వంద రూపాలయ జరిమాన విధిస్తూ వేములవాడ ప్రథమశ్రేణి న్యాయమూర్తి జ్యోతిర్మయి మంగళవారం తీర్పు ఇచ్చినట్లు టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. వివరాల ప్రకారం వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రుద్రవరం గ్రామంలో మార్చి 3వ తేదిన మల్లికార్జున స్వామి ఆలయంలో దొంగతనం జరిగింది. గ్రామానికి చెందిన ఊరడి రాజిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ముప్కాల్ మండలంకు చెందిన నాగరాజు, నిజమాబాద్ జిల్లాకు చెందిన సాయుకుమార్‌లు పాల్పడినట్లు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కి తరలించారు. విచారణ అధికారి గోపాల్‌రెడ్డి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా సీఎమ్ఎస్ ఎస్సై రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ సురేష్ సాక్షులను ప్రవేశపెట్టారని, ప్రాసిక్యూషన్ తరుపున విక్రాంత్ అనే న్యాయవాది కేసు వాదించగా పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి సదరు ఇద్దరు నేరస్తులకు 8 నెలల కారాగార జైలు శిక్షతో పాటు వంద రూపాయాల జరిమానా విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లందకుంట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకుర్తి గ్రామం మీదుగా మంగళవారం అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. జమ్మికుంట మండలంలోని తనుగుల గ్రామం నుంచి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని ట్రాక్టర్ డ్రైవర్ సంపత్, యజమాని మల్లేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.



తీరనున్న కష్టాలు

- ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లలో అదనంగా సాధారణ బోగీలు
- రెండు నుంచి నాలుగు వరకు పెరిగిన బోగీలు
- పలు రైళ్లకు జత చేసిన అధికారులు
- దశల వారీగా అన్ని రైళ్లలో అమలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

దేశవ్యాప్తంగా నడుస్తున్న ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లలో ఉన్న రెండు సాధారణ బోగీలతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికుల కష్టాలు తీరనున్నాయి. అన్ని రైళ్లలో నాలుగు సాధారణ బోగీలను ఏర్పాటు చేయాలని కేంద్ర రైల్వే శాఖ తీసుకున్న నిర్ణయం మేరకు ఆయా ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో అదనంగా మరో రెండు బోగీలను అమరుస్తున్నారు. ఈనెల నుంచి పలు రైళ్లలో అదనపు బోగీలను అమర్చడం ప్రారంభించారు. డిసెంబరు నెలాఖరు వరకు సుమారు 800 ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో అదనపు బోగీలను అమర్చనున్నారు. దేశంలోని వివిధ రూట్లలో వివిధ రైల్వేలు నడుపుతున్న ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్లన్నింటికీ రెండు సాధారణ బోగీలు మాత్రమే అమర్చారు. మిగతా బోగీలు త్రీటైర్, టూటైర్, నాన్ ఏసీ బెర్త్‌లను నడిపారు. వీటిలో ప్రయాణించేందుకు రిజర్వేషన్ సౌకర్యంతో పాటు సీట్లు ఖాళీ ఉంటే స్టేషన్లలో టిక్కెట్లు తీసుకుని ప్రయాణించే సౌకర్యం ఉంది. సాధారణ బోగీలు రెండు మాత్రమే ఉండడంతో ప్రయాణికులు చాలా మంది సీట్లు నిండిన తర్వాత నిల్చుని ప్రయాణిస్తున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే రైళ్లలో సాధారణ ప్రయాణికుల పరిస్థితి మరింత దారుణం. ఎన్నో ఏళ్లుగా ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లలో సాధారణ బోగీలను పెంచాలనే డిమాండ్ ఉంది. ఆ మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రులు, అధికారుల దృష్టికి వెళ్లడంతో మరో రెండు సాధారణ బోగీలను జత చేసి నడుపుతామని జూన్‌లో ప్రకటించారు. దీంతో ఈనెల నుంచి పలు రైళ్లకు అదనంగా రెండు సాధారణ బోగీలను అమర్చడం ప్రారంభించారు. వచ్చే నెలాఖరు వరకు దశల వారీగా అన్ని రైళ్లకు అదనపు బోగీలను జత చేయనున్నారని రైల్వే శాఖ అధికారులు పేర్కొంటున్నారు. అదనపు సాధారణ బోగీలను జత చేయడం వల్ల వాటిల్లో ప్రయాణం చేసే వలస కార్మికులకు, దినసరి కూలీలకు, విద్యార్థులకు కొంత ఊరట కలగనున్నది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రైస్‌మిల్ పరిశ్రమలు, ఇటుక బట్టీల పరిశ్రమలతోపాటు భవన నిర్మాణ రంగం, హోటళ్లలో పని చేసేందుకు ఉత్తర భారత దేశం నుంచి వేలాది మంది వలస కార్మికులు పనుల కోసం వస్తున్నారు. అదనపు సాధారణ బోగీలను అమర్చడం వల్ల వలస కార్మికులకు ఎంతో మేలు జరగనున్నది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పెద్దపల్లి జంక్షన్, రామగుండం, జమ్మికుంట రైల్వేస్టేషన్ల నుంచే వలస కార్మికులు, కూలీలు, ఇతరులు ప్రయాణిస్తుంటారు. జిల్లా మీదుగా నడిచే పలు రైళ్లలో అదనంగా రెండు సాధారణ బోగీలను అమర్చారు.



- జమ్మికుంట, పెద్దపల్లి జంక్షన్, రామగుండం రైల్వేస్టేషన్లలో నిలిచే సికింద్రాబాద్ నుంచి దాణాపూర్ పాట్నా నుంచి సికింద్రాబాద్ 12791/92 సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో అదనంగా రెండు సాధారణ బోగీలు జత చేసి నడుపుతున్నారు.
- రామగుండం రైల్వే స్టేషన్‌లో ఆగే 12295/96 శ్రీమోక్షగుండం విశ్వేశ్వరయ్య బెంగళూరు నుంచి దాణాపూర్, పాట్నా నుంచి శ్రీమోక్షగుండం విశ్వేశ్వరయ్య బెంగళూరు సంఘమిత్ర సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో అదనంగా రెండు సాధారణ బోగీలు జత చేసి నడుపుతున్నారు. ఇప్పుడు ఈ రైలులో నాలుగు సాధారణ బోగీలు ఉన్నాయి. ఇప్పటికే మన దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని కాజీపేట నుంచి బల్లార్షా సెక్షన్‌కి సంబంధించిన దూర ప్రాంత రైళ్లలో మన జోన్‌కు, ఇతర జోన్‌లకు చెందిన రైళ్లలో కొన్నింటిలో అమర్చారు.
- జమ్మికుంట, రామగుండం రైల్వే స్టేషన్‌లో నిలిచే 12721/22 నాంపల్లి హైదరాబాదు నుంచి ఢిల్లీ నిజాముద్దీన్, అక్కడి నుంచి నాంపల్లి హైదరాబాదు దక్షిణ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో అదనంగా రెండు సాధారణ బోగీలు జత చేసి నడుపుతున్నారు.
- రామగుండం రైల్వేస్టేషన్‌లో నిలిచే 12625/26 తిరువనంతపురం నుంచి కొత్త ఢిల్లీ, అక్కడి నుంచి తిరువనంతపురం కేరళ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో అదనంగా రెండు సాధారణ బోగీలు జత చేసి నడుపుతున్నారు.
- రామగుండం రైల్వే స్టేషన్‌లో నిలిచే 12615/16 ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ నుంచి కొత్త ఢిల్లీ నుంచి ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (జీటీ) గ్రాండ్ ట్రంక్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో అదనంగా రెండు సాధారణ బోగీలు జతచేసి నడుపుతున్నారు.
- సాధారణ బోగీలు లేని ఆంధ్రప్రదేశ్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ 20805/06 విశాఖపట్నం నుంచి కొత్త ఢిల్లీ వరకు, అక్కడి నుంచి విశాఖపట్నం నడిచే రైలులో నాలుగు సాధారణ బోగీలు జత చేసి నడుపుతున్నారు. ఈ రైలుకు పెద్దపల్లి జంక్షన్, రామగుండం రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ ఉంది.
- ఇప్పటికే పెద్దపల్లి, రామగుండంలో నిలిచే 22152/51 పూణె నుంచి కాజీపేట, కాజీపేట నుంచి పూణె వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో కూడా అదనంగా రెండు సాధారణ బోగీలు అందుబాటులోకి వచ్చాయి.
- రామగుండం రైల్వే స్టేషన్‌లో నిలిచే 12511/12 రప్తిసాగర్ ట్రైవీక్లీ, కోర్బా బైవీక్లీ, అహిల్యానగరి వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో అదనంగా రెండు సాధారణ బోగీలు అందుబాటులోకి వచ్చాయి.
- రామగుండం రైల్వే స్టేషన్‌లో నిలిచే 12723/24 నాంపల్లి హైదరాబాదు నుంచి కొత్త ఢిల్లీ వరకు, అక్కడి నుంచి నాంపల్లి హైదరాబాదుకు నడిచే తెలంగాణ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో అదనంగా రెండు సాధారణ బోగీలు జత చేయనున్నారు.
- పెద్దపల్లి జంక్షన్‌లో నిలిచే 12656/55 అహ్మదాబాద్ నుంచి ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ నుంచి అహ్మదాబాద్ నవజీవన్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో కూడా అదనంగా రెండు సాధారణ బోగీలు జత చేయనున్నారు.

జగిత్యాల ప్రధాన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒకరి మృతి

జగిత్యాల అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా ఆస్పత్రిలో బీర్‌పూర్ మండలం రంగసాగర్ గ్రామానికి చెందిన అజ్మీర దేశాయి నాయక్(79) అనే వృద్ధుడు మంగళవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు ఆస్పత్రి వర్గాల ద్వారా తెలిసింది. బీర్‌పూర్ మండలం రంగసాగర్ గ్రామానికి చెందిన దేశాయి నాయక్ సోమవారం అనారోగ్య కారణంతో జగిత్యాల ప్రధాన ఆస్పత్రిలో చేరాడు. పరిస్థితి విషమించి మంగళవారం మధ్యాహ్నం మృతి చెందాడు. కాలికి ముల్లు గుచ్చుకుందని ఆస్పత్రికి తీసుకువస్తే అప్పటి నుంచి ఎలాంటి చికిత్స అందించకపోవడం వల్లనే మృతి చెందాడని, మూడు రోజుల క్రితం వరకు చలాకీగా ఉండి కూలీ పనులు చేసాడని కుటుంబ సభ్యులు తెలిపారు. వైద్యులు సరైన చికిత్స అందించక పోవడం వల్లనే చనిపోయాడని మృతుడి బంధువుల ఆస్పత్రి వద్ద రోదించారు.

నాంపల్లి గుట్టపైన లీజు హక్కులకు టెండర్

- సరైన వేలం రాకపోవడంతో రద్దు

వేములవాడ కల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ ఆలయమైన నాంపల్లి శ్రీలక్ష్మీనర్సింహస్వామి వారి దేవస్థానములోని పలు లీజు హక్కులకు బుధవారం ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో బహిరంగ వేలము, పేపర్ టెండర్, ఆన్‌లైన్ టెండర్స్ నిర్వహించారు. ప్రమిదలు చమురుతో వున్న వత్తులు అమ్ముకొను హక్కును రెండు సంవత్సరాలకు గాను వేములవాడకు చెందిన బిక్షపతి రూ. 50 లక్షల 55 వేల 555కు దక్కించుకున్నారు. కొబ్బరి కాయలు, పూజ సామాగ్రి అమ్ముకొను హక్కులను జోగాపూర్ గ్రామానికి చెందిన విక్రమ్ అనే వ్యక్తి రూ. 55 లక్షల 55 వేల 999లకు, పప్పు బెల్లం, బొమ్మలు ఆటవస్తువులు అమ్ముకునే లీజును రూ. 10 లక్షల 6 వేల 666కు దాచారం గ్రామానికి చెందిన పర్శరాములకు దక్కగా, కొబ్బరి ముక్కలు ప్రోగుచేసుకునే లీజును జోగాపూర్ గ్రామానికి చెందిన విక్రమ్ రూ. 21 లక్ష 55 వేల 999లకు దక్కించుకున్నారు. నాగఫణీ వద్ద ఇన్ స్టాంట్ ఫోటోలు లీజు హక్కును దాచారంకు చెందిన పర్శరాములు రూ. 24 లక్షల 6 వేల 666 హెచ్చుబిడ్డు ద్వారా టెండర్లను దక్కించుకున్నట్లు ఆఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. కాగా గుట్టపైన క్యాంటీన్ నిర్వహణ లీజు హక్కును ఎవరు డిపాజిట్లు చెల్లించలేదని, నూనె గురుగులు, పాలు అమ్ముకును హక్కు అంశములకు సరియగు వేలం పాట రానందున ఇట్టి రెండు టెండర్స్ వాయిదా వేసినట్లు తెలిపారు.

టెండర్ నిర్వహణలో ఆలయ ఈవో, ఏఈవోలు, సూపరిండెంట్‌లు, దేవాదాయ ధర్మదాయ అసిస్టెంట్ కమిషనర్‌లు ఉన్నట్లు పేర్కొన్నారు.

ఖతార్ దేశంలో జగిత్యాల జిల్లా వాసి ఆదృశ్యం?

● ఆరు నెలలుగా తప్పని ఎదురుచూపులు ● భర్త ఆచూకీ కనిపెట్టాలంటూ ప్రవాసీ ప్రజావాణిలో భార్య ఫిర్యాదు

గొల్లపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి నిమిత్తం దోహ-ఖతార్ దేశం వెళ్లిన ఓ యువకుడు ఆరు నెలలుగా పత్తా లేకుండా పోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. తన భర్త ఆచూకీ కనిపెట్టాలంటూ గల్ఫ్ బాధితుడి భార్య రాసూరి సునీత కాంగ్రెస్ ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డితో కలిసి మంగళవారం తన కుటుంబ సభ్యులతో హైదరాబాద్‌లోని ప్రవాసీ ప్రజావాణిలో సీనీయర్ ఐఏఎస్ అధికారిణి దివ్యదేవ రాజన్‌కు వినతి పత్రం సమర్పించింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం దట్నూర్ గ్రామానికి చెందిన రాసూరి రాజేందర్ కొన్నేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం దోహ-ఖతార్ దేశం వెళ్లాడు. అక్కడే పని చేస్తూ ఉన్న క్రమంలో తన ఉద్యోగం పోయిందని, మాల్టా దేశం వెళ్తానని అందుకు రూ. 5 లక్షలు అవసరమవుతాయని, వాటిని తనకు పంపించాలని ఆరు నెలల క్రితం దట్నూర్‌లో ఉన్న తల్లి, భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో భార్య సునీత, తల్లి కలిసి బంధుమిత్రులు, తెలిసిన వాళ్ల దగ్గర అప్పు చేసి రాజేందర్‌కు రూ. 5 లక్షల పంపించారు. డబ్బులు పంపించిన అనంతరం రాజేందర్ ఫోన్ స్విచ్ఛాఫ్ అయిందని, అప్పటి నుంచి ఇప్పటివరకు ఆరు నెలలుగా అతడి ఆచూకీ లభించడం లేదని బాధితుడి కుటుంబ సభ్యులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. దీనికి స్పందించిన ఐఏఎస్ అధికారిణి దివ్యా దేవరాజన్ వెంటనే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయించి దర్యాప్తు చేయించాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి నరేష్‌ను ఆదేశించినట్లు బాధితురాలు సునీత తెలిపారు.


ప్రజావాణి నోడల్ అధికారి దివ్యదేవరాజన్‌కు మొరపెట్టుకుంటున్న బాధిత కుటుంబ సభ్యులు

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

గంభీరావుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట తసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో కార్యాలయాల ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సకాలంలో బిల్లులు చెల్లించకుంటే మధ్యాహ్న బోజనం సరుకులు ఎలా తెచ్చేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే లక్షల కొద్ది అప్పులు తెచ్చి వంట చేస్తుంటే అధికారులు తనిఖీల పేరిట ఇబ్బంది పెడుతున్నారన్నారు. నిత్యావసరాల ధరలు రోజు రోజుకు ఆకాశానంటుతున్నాయన్నారు. మెస్ చార్జీలు పెంచక మూడేళ్లు దాటిందని, నిత్యావసర సరుకులు ప్రభుత్వమే సరపరా చేయాలని అన్నారు. గ్యాస్ సిలిండర్లు ప్రభుత్వమే సరపరా చేయాలన్నారు. అంతకుముందు వినతి పత్రాలు అందజేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్, కార్మిక సంఘం నాయకులు రాజమణి, మహేశ్వరీ, రేఖ, లక్ష్మణ్, వరలక్ష్మి, నిర్మల, బాలవ్వ, జ్యోతి, ధనలక్ష్మి తదితరులు ఉన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట దర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

పెద్దపల్లి మాజీ ఎంపీ గొట్టె భూపతికి మంత్రి పరామర్శ


గొట్టె భూపతిని పరామర్శిస్తున్న శ్రీధర్‌బాబు

కరీంనగర్ అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మాజీ ఎంపీ గొట్టె భూపతి సతీమణి, రాచకొండ పోలీస్ కమిషనర్ గొట్టె సుధీర్‌బాబు తల్లి గొట్టె శాంత రెండు రోజుల కిందట మరణించగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంగళవారం పరామర్శించారు. కరీంనగర్ మంకమ్మతోటలోని నివాసానికి వెళ్లిన మంత్రి గొట్టెభూపతి, సుధీర్‌బాబులను కలిసి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మంత్రితో పాటు సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు సమద్‌నవాబ్, ఎండీ తాజ్ తదితరులు ఉన్నారు.

వైద్య కళాశాలకు పార్థివదేహం


లక్ష్మి పార్థీవదేహాన్ని వైద్య కళాశాలకు అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు

సుభాష్‌నగర్/ కరీంనగర్ రూరల్/కల్చరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యావేత్త, రచయిత వీరగోని పెంటయ్య సతీమణి వీరగోని లక్ష్మి(65) పార్థివదేహాన్ని మంగళవారం చల్మెడ ఆనందరావు మెడికల్ కళాశాలకు అందజేశారు. ఈనెల 23న రాత్రి లక్ష్మి గుండెపోటుతో మరణించారు. గత ఏడాది వీరగోని పెంటయ్య, లక్ష్మీ దంపతులు మరణానంతరం దేహదాన అంగీకార పత్రాలపై సంతకాలు చేశారు. వారి కోరిక మేరకు కుమారుడు, కూతురు అమెరికా నుంచి మంగళవారం వచ్చి అంతిమయాత్ర నిర్వహించి పార్థివదేహాన్ని మెడికల్ కాలేజీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో వీరగోని పెంటయ్య, కుమారులు నరేష్, సురేష్, కుమార్తెలు సమత, సౌజన్య డాక్టర్ బి లచ్చయ్య, రఘుశంకర్ రెడ్డి, శ్రావణ్‌కుమార్, కనకయ్య, రాజేందర్, బుర్ర తిరుపతి, సీవీ కుమార్, డి అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

వీరగోని పెంటయ్య కుటుంబాన్ని మంత్రి శ్రీధర్‌బాబు పరామర్శించారు. ఆయన వెంట సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పదేళ్లలో చేయని ప్రగతిని ఏడాదిలోనే సాధించాం

● ఎల్‌మడుగు, రామగిరి ఖిల్లాను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తాం ● మంథనిలో సిల్క్ డెవలమెంట్ సెంటర్, మహిళ పారిశ్రామిక పార్కు
● మంథని వద్ద గోదావరి నదిపై రూ. 1.20 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం ● ప్రజాపాలన విజయోత్సవంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, నవంబరు 26: రాష్ట్రంలో గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో చేయని అభివృద్ధి పనులను తమ కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలోనే సాధించామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. స్థానిక శివకిరణ్ గార్డెన్స్‌లో మంగళవారం జరిగిన ప్రజాపాలన విజయోత్సవం కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దీవాలా తీసిన ఆర్థిక క్రమశిక్షణతో సీఎం రేవంత్‌రెడ్డి, తమ మంత్రివర్గం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయటానికి, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అనేక పథకాలతో ముందుకు సాగుతున్నామన్నారు. ఎన్నికల హామీలో ఆరు గ్యారెంటీల్లో అధికారంలోకి వచ్చిన వెంట నే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కు సబ్సిడీపై గ్యాస్ సిలెండర్, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ అమలు చేస్తున్నామన్నారు. స్థలం ఉండి ఇల్లు లేని పేదలకు త్వరలోనే రూ.5లక్షలతో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. మిగిలిన వాటిని త్వరలో అమలు చేయటానికి కృషి చేస్తున్నారు. రైతులకు, కౌలు రైతులకు ఎంఎస్‌పీతో పాటు సన్న వడ్ల రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. గింజ తరుగు లేకుండా రైతుల వడ్లను కొనుగోలు చేస్తున్నామన్నారు. ఏడాదిలోనే నెలకు 5 వేల ఉద్యోగాల చొప్పున 55 వేల మంది చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇచ్చామన్నారు. పదేళ్లుగా ఆగిపోయిన ఉద్యోగుల బదీలు, పీఈటీలకు ప్రమోషన్లను తమ ప్రభుత్వం క్లియర్ చేసిందన్నారు. అనేక పరిశ్రమల్లో నిరుద్యోగ యువతకు స్కిల్స్ డెవలప్ చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. ఏడాదిలో అనేక కార్యక్రమాల అమలుతో ముందుకు సాగుతున్న తమ ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు ఇంకా విమర్శించడం ఎందుకని ప్రశ్నించారు. వారికి తమ పని తీరుతోనే జవాబు చెప్తామన్నారు. ఏడాదిలో తమ ప్రభుత్వ సాధించిన ప్రగతిని ప్రజలకు తెలియజేసి వారి ఆశీర్వాదం తీసుకోవటానికి ప్రజా విజయోత్సవ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెద్దపల్లి జిల్లాను, మంథని నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రభాగాన నిలుపుతామన్నారు. మంథనిలో, పెద్దపల్లిలో జిల్లా, డివిజన్ స్థాయిల్లో మహిళా సమాఖ్య భవనాలను నిర్మిస్తామన్నారు. మంథని గోదావరినదిపై రూ.1.20 కోట్లతో బ్రిడ్జి నిర్మించి వ్యాపారపరంగా అభివృద్ధి చేస్తామన్నారు. కూచిరాజ్‌పల్లి, బోయినిపేటల మీదుగా బైపాస్ రోడ్డును నిర్మిస్తామన్నారు. మంథనిలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. మహిళా పారిశ్రామిక పార్కును ఏర్పాటుచేసి మహిళలకు ఉపాధి అవకాలు కల్పిస్తామన్నారు. గోదావరినదిలోని ఎల్.మడుగు ఇరువైపులా అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. ఇందుకు రూ.7కోట్లతో ఖానాపూర్ పిడబ్ల్యూడీ రోడ్ నుంచి ఎల్. మడుగు వరకు డబుల్ రోడ్ నిర్మాణానికి శంకుస్థాన చేశామన్నారు. రామగిరి ఖిల్లాను సైతం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు ద్వారా సొంత భవనాలు లేని గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాల నిర్మాణం కోసం నిధులు కేటాయించామన్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో సమగ్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలుచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వేణు, మున్సిపల్, పీఏసీఎస్ చైర్మన్లు పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, కొత్త శ్రీనివాస్, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గిరిజన బాలిక మృతి


రక్షిత(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, నవంబరు26(ఆంధ్రజ్యోతి)ః చిన్న విషయానికి మానసిక ఆందోళనకు గురై ఈ నెల 20న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గిరిజన బాలిక మాలోతు రక్షిత(17) స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. వారి కథనం మేరకు.. మండలంలోని దేవునిగుట్ట తండా గ్రామ పంచాయతీ పరిధిలోని చింతకుంటతండాకు చెందిన మాలోతు మంజుల-తిరుపతి దంపతులకు ఇద్దరు పిల్లలు రక్షిత, రాహుల్ ఉన్నారు. తిరుపతి 14 ఏళ్ల కిందట భార్యాపిల్లలను వదిలి వెళ్లిపోయాడు. దాంతో మంజుల కూతురు రక్షిత, రాహుల్‌ను తీసుకుని 10 ఏళ్ల కిందట ఎల్లారెడ్డిపేట గ్రామానికి చేరుకుంది. ఓ గదిని అద్దెకు తీసుకుని బట్టల దుకాణంతో పాటు కుట్లు, అల్లికలతో ఉపాధి పొందుతూ పిల్లలను సాకుతోంది. కూతురు రక్షిత దుమాల ఈఎంఆర్ఎస్ కళాశాలలో ఇంటర్ చదివి గత యేడాది అనుత్తీర్ణురాలైంది. దాంతో అప్పటి నుంచి తల్లికి చేదోడువాదోడుగా ఉంటోంది. మానసిక స్థితి సరిగా లేక ఆందోళనకు లోనైన ఆమె ఈ నెల 20న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబీకులు రక్షితను స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

సంస్కృతిని పరిరక్షించాల్సిన బాధ్యత యువతదే

● శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఉమేష్ కుమార్



యూనివర్సిటీలో బతుకమ్మ ఆడుతున్న ఎస్‌యూ వైస్ చాన్స్‌లర్ ఉమేష్‌కుమార్ దంపతులు

గణేశ్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సమాజంలో సంస్కృతిని, సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత యువతదే అని శాతవాహన విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య ఉమేష్ కుమార్ అన్నారు. మంగళవారం శాతవాహన విశ్వ విద్యాలయం కాలేజీ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఎత్నిక్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వీసీ ఉమేష్ కుమార్ సతీసమేతంగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి ఉత్సవాలను నిర్వహించడం వల్ల యువతకు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కలుగుతుందన్నారు. అంతకముందు విద్యార్థులు బోనాలు, పల్లకితో అమ్మవారిని విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఊరేగింపుగా తీసుకువచ్చారు. విద్యార్థులు, అధ్యాపకులు ఉగాది, దీపావళి, సంక్రాంతి, కృష్ణాష్టమి, క్రిస్మస్, వినాయక చవితి, బోనాలు, బతుకమ్మ, దసరా పండుగలను ఘనంగా నిర్వహించారు. ఉప కులపతిచే ఉట్టి కొట్టించి, జమ్మి పూజ చేసి రావణ దహనం చేయించారు. అనంతరం వీసీ దంపతులు బతుకమ్మ ఆడారు. విద్యార్థులు, అధ్యాపకులు అన్ని పండుగలకు సంబంధించిన 200 రకాల పిండి పదార్థాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వరప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హరికాంత్, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ మనోహర్, అధ్యాపకులు డాక్టర్ తిరుపతి, డాక్టర్ కృష్ణకుమార్, డాక్టర్ మనోజ్, డాక్టర్ నరేష్, డాక్టర్ పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కరాటే పోటీలకు చీఫ్ అఫీషియల్‌గా వసంత్ కుమార్



వసంత్ కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ మహారాష్ట్రలోని పూణే పట్టణంలోని ఛత్రపతి స్పోర్ట్స్ స్టేడియంలో ఈ నెల 28 నుంచి డిసెంబర్ 1 వరకు నిర్వహించనున్న 27వ జాతీయస్థాయి కరాటే పోటీలకు చీఫ్ అఫీషియల్‌గా జిల్లాకు చెందిన కే వసంత్‌కుమార్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ ఎస్ శ్రీనివాసన్ నుంచి ఆదేశాలు అందుకున్నట్లు వసంత్‌కుమార్ పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

బోయినపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బోయినపల్లి మండలం మల్కాపూర్‌లో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొడిమ్యాల మండలం నల్లగొండ గ్రామానికి చెందిన నాంపల్లి (49) అనే వ్యక్తి నల్లగొండ గుట్ట ప్రాంతానికి సోమవారం అడవి పందుల వేట కోసం వెళ్లినట్లు సమాచారం. నాంపల్లి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గుట్ట శివారు ప్రాంతంలో గాలింపు చేపట్టారు. నాంపల్లి విద్యుదాఘాతానికి గురై కనిపించడంతో పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మోతీలాల్ తెలిపారు.

కోనోకార్పస్‌తో ముప్పు..!



హుజూరాబాద్ నుంచి జమ్మికుంటకు వెళ్లే ప్రధాన రహదారి మధ్యలోని డివైడర్ మధ్యలో ఏపుగా పెరిగిన కోనోకార్పస్ చెట్లు

- పుప్పొడితో అలర్జీ, శ్వాసకోశ వ్యాధులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- మొక్కలు తొలగించాలని కోరుతున్న ప్రజలు
- ప్రజాప్రతినిధులు స్పందించాలి

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారుల వెంబడి, పట్టణాల్లోని డివైడర్ల మధ్య సుందరీకరణలో భాగంగా గత ప్రభుత్వ హయాంలో నాటిన కోనోకార్పస్ మొక్కలు పర్యావరణానికి పెను ముప్పుగా మారాయి. శ్వాసకోశ సంబంధిత వ్యాధులకు కారణమవుతున్న ఈ మొక్కలను తొలగించాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు. అధికారులు అక్కడక్కడా తొలగించి చేతులు దులుపుకున్నారు. ఏపుగా పెరుగుతున్న ఈ మొక్కలు వాటి పరిసరాల్లో మరే మొక్కను పెరగనివ్వకుండా పర్యావరణానికి హాని కలిగిస్తుంది. మనుషులతో పాటు జంతువులకు కూడా హాని ఇవి హానికరమని అంటున్నారు. ఈ చెట్ల మీద ఒక పిట్ట కూడా వాలడం లేదంటే పర్యావరణానికి ఇవి ఎంతో హానికరమో ఇట్టే అర్థమవుతుంది. హుజూరాబాద్ నుంచి శాలపల్లి-ఇందిరానగర్ గ్రామం వరకు ఇటు హుజూరాబాద్ నుంచి బోర్నపల్లి వరకు, కొత్తపల్లి వరకు ప్రధాన రహదారుల మధ్య కోనోకార్పస్ చెట్లు ఏపుగా పెరిగాయి.

● అవెన్యూ ప్లాంటేషన్., రహదారుల పక్కన

గత ప్రభుత్వ హయాంలో పచ్చదనం-పరిశుభ్రత, హరితహారం కార్యక్ర మంలో భాగంగా ప్రభుత్వం కోనోకార్పస్ ఒక్కో మొక్కను రూ. 50లు వెచ్చించి కొనుగోలు చేసి నాటించారు. వారాల వ్యవధిలో ఈ మొక్కలు విపరీతంగా పెరిగి వేర్లు కూడా భూమిలోకి లోతుగా వెళ్లి వాటి పరిసరాల్లో మరే మొక్కను పెరగ నివ్వకుండా చేస్తున్నాయి. గ్రామాల్లో అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా భారీ సంఖ్యలో మొక్కలను నాటారు. అలాగే ప్రకృతి వనంలో, గ్రామాలకు వెళ్లే ప్రధాన రహ దారుల పక్కన ఏపుగా పెరిగిన కోనోకార్పస్ మొక్కలు దర్శనమిస్తున్నాయి.

● చూడడానికి ఆహ్లాదంగానే.. కానీ..

పచ్చదనంతో నిండుకుని ఉన్న ఈ చెట్లను చూస్తే ఆహ్లాదకరంగానే ఉంటుంది. కానీ మొక్కలు పూతకు వచ్చినప్పుడే అత్యంత ప్రమాదకరంగా మారుతోంది. ఈ మొక్కల నుంచి వెలువడే పుప్పొడి రేణువుల వల్ల మనుషుల్లో అలర్జీ, శ్వాసకోశ వ్యాధులు, అస్తమా వంటి జబ్బులు రావడమే కాకుండా చివరి వరకు అది కేన్సర్‌కు దారి తీసే అవకాశం ఉందని శాస్త్రవేత్తల పరిశోధనలో తేలింది. దీంతో ఈ మొక్కలను తొలగించాలని గత ప్రభుత్వ హయంలోనే అధికారులు తీర్మానం చేసినప్పటికీ అక్కడక్కడా రోడ్డు పక్కన తొలగించారు. కానీ గ్రామాల్లో ఉన్న చెట్లను మాత్రమే వదిలేశారు. పలు పంచాయతీల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాల్లో ఈ మొక్కలే ప్రధానంగా కనిపిస్తున్నాయి. రోడ్డు పక్కన, ప్రధాన రోడ్డు మధ్యలో నాటిన ఈ మొక్కల వేళ్లు భూమిలోకి లోతుగా పాతుకుపోయి అడ్డు వచ్చే కేబుల్ వైర్లు, వాటర్ పైప్‌లైన్లను ధ్వంసం చేస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పర్యావరణానికి హాని కలిగించే మొక్కల నుంచి ప్రజలకు, జంతువులకు రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజాప్రతినిధులు స్పందించాలి



కోనోకార్పస్ మొక్కలు చాలా గ్రామాల్లో నాటారు. నిత్యం ప్రజలు ఈ మొక్కల పక్క నుంచి వెళ్తున్నారు. మొక్కలు ప్రాణాంతకమని తెలిసినా అధికారులు, ప్రజాప్రతతినిధులు పట్టించుకోవడం లేదు. ఇకనైనా స్పందించి వాటిని తొలగించి నీడనిచ్చే ఇతర మొక్కలు లేదా పండ్ల మొక్కలు నాటాలి.

- వేల్పుల ప్రభాకర్, పర్యావరణ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు

వెంటనే తొలగించాలి



పచ్చదనం పేరుతో నాటిన మొక్కల్లో సగం వరకు కోనోకార్పస్ మొక్కలే ఉన్నాయి. ఎక్కడ చూసినా రోడ్డు వెంట ఈ మొక్కలే దర్శనం ఇస్తున్నాయి. ఉన్నతాధికారులు, మండల స్థాయి అధికారులు స్పందించి వెంటనే తొలగించాలి. వాటి స్థానంలో ఇతర ఉపయోగపడే మొక్కలు నాటాలి.

-బింగి కరుణాకర్, బీజేపీ జిల్లా కార్యదర్శి, రంగాపూర్.

జాతీయ స్థాయి పోటీలకు సైనిక్ స్కూల్ విద్యార్థి



హోప్ రాజ్

చొప్పదండి, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్ సైనిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యాడు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోలో ఈనెల 30వ తేదీ వరకు జరగబోయే అండర్ 17 విభాగంలో జాతీయ స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ 400 మీటర్ల రన్నింగ్ పోటీలకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థి కె. హోమ్‌రాజ్ ఎంపికయ్యాడు. కాగా హోమ్‌రాజ్‌ను స్కూల్ డైరెక్టర్ కర్నల్ కేసి రావు, ప్రిన్సిపాల్ కాళహస్తి, ఉపాధ్యాయులు అభినందించారు.

యువకుడి మృతిపై అనుమానాలు

- నాలుగు రోజుల క్రితం మృతి
- పంచనామా చేసిన అధికారులు

ఇల్లంతకుంట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఒగులాపూర్ గ్రామానికి చెందిన పెంటల శ్రీనివాస్ (40) అనే యువకుడి మృతిపై అనుమానాలు తలెత్తడంతో అధికారులు పంచనామా నిర్వహించారు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. శ్రీనివాస్ నాలుగు రోజుల క్రితం మృతిచెందాడు. దీంతో కుటుంబ సభ్యులు సాధరణ మృతి అని చెప్పి అంత్యక్రియలు నిర్వహించారు. తన తమ్ముడి మృతిపై అనుమానాలు ఉన్నాయని, అక్క విజయ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో తహసీల్దార్ ఫారూఖ్, ఎస్సై శ్రీకాంత్‌గౌడ్, సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు ఫాతిమా మంగళవారం ఒగులాపూర్ గ్రామానికి చేరుకొని ఎముకలు, బూడిదను ఫోర్సినిక్ ల్యాబ్‌కు పంపారు. రిపోర్టు ఆధారంగా చర్యలు ఉంటాయని అధికారులు తెలిపారు.

గుంతలో పడి వాహనదారుడికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, నవంబరు26(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామ శివారులోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై మంగళవారం రాత్రి గుంతలో పడి బొప్పాపూర్‌కు చెందిన వాహనదారుడు బిస్క సత్యం తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సత్యం తన ద్విచక్రవాహనంపై గొల్లపల్లి గ్రామ శివారులోని పెట్రోల్ బంక్‌లో పెట్రోలు పోయించుకుని తిరిగి వస్తున్న క్రమంలో వాహనం గుంతలో పడి అదుపు తప్పింది.

ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొండా సురేఖ



కార్మిక దంపతులు, చిన్నారికి నూతన వస్త్రాలు అందిస్తున్న మంత్రి సురేఖ

● మంత్రి కొండా సురేఖ

పెద్దపల్లి రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలోని ఆలయాల భూములను అన్యాక్రాంతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వాటిపై సర్వే నంబర్‌ల వారిగా విచారణ చేపడుతుందని రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మంగళవారం పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామంలోని సీతారామాంజనేయ స్వామి దేవాలయాన్ని 50 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులను మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. అంతుకు ముందు గ్రామస్థులు, కాంగ్రెస్ నాయకులు రంగాపూర్ గ్రామం నుంచి మంత్రి, ఎమ్మెల్యేను ద్విచక్ర వాహనాలతో స్వాగతం పలుకగా ఆలయ సమీపంలో మంత్రిని ఎడ్లబండి ఎక్కించి ఆలయం వరకు మహిళలు కోలాట నృత్యాలతో స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి మంత్రి, ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రమైన యాదాద్రిని నిర్మించినా భక్తులకు ఎలాంటి వసతులు కల్పించలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలో భక్తులకు తాగునీరు, వసతులు కల్పించామన్నారు. అలాగే యాదాద్రి ఆలయ గోపురానికి బంగారు తొడుగును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. యదాద్రి వద్ద వికలాంగులకు లిఫ్ట్ సౌకర్యం, బ్యాటరీ కార్లు ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అలాగే వేములవాడ ఆలయాన్ని సైతం అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఆలయాల్లో ఉన్న వెండి, బంగారంతో ఆలయానికి ఉపయోగపడే ఆభరణాలు, అలంకరణ వస్తువులు తయారుచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి ఆలయంలో ఉన్న బంగారం, వెండిని లెక్కించి వాటితో వెండి పల్లకీలను తయారుచేయించి నూతనుత్తేజం ఉండేవిధంగా ఆలయాల్లో కార్యక్రమాలు చేపడుతామన్నారు. రాష్ట్రంలోని ఆలయాల భూములు కబ్జాలకు గురవుతున్నాయని, వాటిని త్వరలోనే అధికారులతో సర్వే చేయించి స్వాధీనం చేసుకుంటామన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని ఎండోమెంట్ పరిధిలోని ప్రతి ఆలయానికి టీటీడీ నుంచి వచ్చే నిధులు రాకుండా చేసిందని ఆరోపించారు. పెద్దపల్లి జిల్లాలోని ఓదెల మల్లికార్జున స్వామి ఆలయానికి సబ్బితం ఆలయం అనుసంధానం చేయనున్నట్లు, ప్రతినెల నిర్వహణ ఖర్చుల నిమిత్తం రూ.20 వేలు రానున్నట్లు తెలిపారు. గ్రామస్థులు సైతం ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్ సుప్రియ, పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, పెద్దపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ అనిల్‌కుమార్, మాజీ జడ్పీటీసీ బండారి రాంమ్మూర్తి, మాజీ ఎంపీటీసీ కలబోయిన మహేందర్, చంద శంకర్, చుంచు సదయ్య పాల్గొన్నారు.

కార్మిక దంపతులను చూసి చలించి..

- దుస్తులు, చెప్పులు కొనిచ్చిన మంత్రి

సుల్తానాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు మంత్రి కొండా సురేఖ వెళ్తుండగా సుల్తానాబాద్ పట్టణంలో పూసాల చౌరస్తా సమీపంలో తల్లిదండ్రులతో కలిసి వెళ్తున్న చిన్నారిని గమనించారు. కారు ఆపి దిగి ఆమె వద్దకు వెళ్లారు. చెప్పులు లేకుండా చిన్నారిని రోడ్డుపై నడిపిస్తున్న ఒడిశా కార్మిక దంపతుల మందలించారు. వారిని తనతో పాటు ఓ చెప్పుల షాపులోకి తీసుకువెళ్లి ముగ్గురికి చెప్పులు కొనిచ్చారు. ఆ తర్వాత బట్టల షాపులోకి తీసుకవెళ్లి దుస్తులు కొనిచ్చారు. మంత్రి ఔదార్యాన్ని పలువురు అభినందించారు.

జస్టిస్ స్వామినాథన్ కమిషన్

సిఫార్సులను అమలు చేయాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతాంగ అబివృద్ధి కోసం జస్టిస్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా అమలు చేయాలని, ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట మంగళవారం ఏఐటీ యూసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రైతులు, నాయకులు ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ ఏవో రామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ చెప్పిన విధంగా పంట దిగుబడి అయ్యే వరకు ఎంత ఖర్చు అయ్యిందో దానికి అదనంగా 50 శాతం ధరను పెంచి పంటలకు రేటు నిర్ణయించాలని, కానీ అమలు కావడం లేదని అన్నారు. దీనికి తోడు రైతు దేశంలో ఎక్కడైనా పంటను అమ్ముకోవచ్చని చెప్పినా కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణ లేక దళారుల రాజ్యంగా మారిపోయిందన్నారు. కార్మికులు కొట్లాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు కోడ్‌లుగా విభజించి కార్పొరేట్ శక్తులకు, ఎఫ్‌డీఐలకు అనుకూలంగా మార్చిందని, 8 గంటల పని విధానానికి బదులు 12 గంటల పని భారాన్ని అమలు చేసే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. సింగరేణి, రైల్వేలను ప్రైవేటు పరం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయన్నారు. ప్రజాస్వామ్య దేశంలో విద్య, వైద్యం, కార్పొరేట్ శక్తుల గుప్పిట్లోకి వెళ్తున్నాయని, దానిని నిరోధించాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కేవీ అనసూయ, పోచయ్య, మల్లయ్య, నర్సయ్య, చంద్రయ్య, మారుతి, నర్సింగోజీ, ఏఐఎఫ్‌టీయూ నాయకులు సోమిశెట్టి దశరథం, గుజ్జె దేవదాస్ ఉన్నారు.

40 ఏళ్ల ఓవర్‌హెడ్ ట్యాంకు కూల్చివేత



నేలకూలిన ట్యాంకు

గంగాధర, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : 40 సంవత్సరాలుగా గ్రామస్థులకు తాగు నీరందించిన ఓవర్‌హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరగా అధికారులు మంగళవారం కూల్చి వేశారు. గంగాధర మండల కేంద్రంలోని గ్రామపంచాయతీకి ఎదురుగా 40 ఏళ్ల క్రితం ఓవర్‌హెడ్ ట్యాంకును నిర్మించారు. ట్యాంకు పక్కన గ్రంథాలయం, ప్రజల ఇళ్లు ఉండగా అధికారులు కూల్చడంలో జాగ్రత్తలు తీసుకున్నారు. ఎవరికీ ప్రమాదం చోటు చేసుకోకుండా సురక్షితంగా ట్యాంకును కూల్చి వేశారు.

ఆలయాల్లో కార్తీక పూజలు

- ధర్మపురి క్షేత్రంలో పెరిగిన భక్తుల రద్దీ
- వేములవాడలో బద్దిపోచమ్మకు బోనం
- కొండగట్టులో భక్తుల పూజలు



కొండగట్టులో క్యూలైన్‌లో వస్తున్న భక్తులు



ధర్మపురి వద్ద గోదావరికి హారతి ఇస్తున్న అర్చకులు



వేములవాడలో భక్తులతో కిక్కిరిసిపోయిన బద్దిపోచమ్మ ఆలయ ప్రాంగాణం

ధర్మపురి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో కార్తీక భక్తులరద్దీ మంగళవారం పెరిగింది. స్థానిక లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ ఆలయా లు భక్తులతో కిట కిటలాడాయి. గోదావరి నదిలో భక్తులు కార్తీకస్నానాలు ఆచరించారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజ లు, కుంకుమార్చన, స్వామివారల నిత్యకళ్యాణం జరిపించారు. స్వామివారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కు మార్‌శర్మ, అర్చకులు, నిత్యపూజలు, అభిషేకాది కార్యక్ర మాలు నిర్వహించారు.

25 వ రోజు ఘనంగా గోదావరి హారతి

కార్తీకమాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 25వ రోజు మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు గోదావరినది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం విశేష పూజలుచేసి నదీ మాత కు హారతి ఇచ్చి కార్యక్రమాన్ని నిర్వహించారు.

వేములవాడ కల్చరల్ : వేములవాడ బద్దిపోచమ్మ అమ్మ వారికి భక్తులు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. సోమ వారం రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న భక్తులు మంగళవారం తెల్లవారు జాము నుంచి అమ్మవారి దర్శనానికి బారు లుదీరారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో సుమారు నాలుగు గంటలపాటు భక్తులు నెత్తిన బోనాలతో వేచి చూశా రు. అనంతరం పట్నాలువేసి ఒడిబియ్యం సమర్పించారు.

వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ కొన సాగుతోంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు రాజ రాజేశ్వర స్వామిని దర్శించుకున్నారు. రాజన్నకు ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు.



బద్దిపోచమ్మ దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక మాసం సందర్భంగా సామూహిక కార్తీక దీపోత్సవం కొనసా గుతోంది. కార్యక్రమాన్ని ఆలయాధికారులు మంగళవారం జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు.

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామిని సన్నిధానం మంగళవారం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రద్దీగా మారింది. కొండపైకి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించు కున్నారు. వేకువ జాము నుంచే వందలాది వాహనాలు, కాలిన డకన కొండపైకి చేరుకున్న భక్తులు అంజన్నకు మొక్కులు తీర్చుకున్నారు. మహిళ భక్తులు ఆలయం ముందుగల రావి చెట్టు వద్ద దీపాలు వెలిగించి కార్తీకపూజలు చేశారు.

కొండగట్టు అంజన్న ఆలయంలో నెల రోజులుగా నిర్వహి స్తున్న సామూహిక కార్తీక దీపోత్సవంను మంగళవారం పర్య వేక్షకులు ఉపాధ్యాయుల చంద్రశేఖర్, అశోక్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

మెట్‌పల్లిటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్‌కు చెందిన న్యాయవాది ఖాసీంపై గుండాలు చేసిన దాడికి నిరసనగా మంగళవారం మెట్‌పల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి కోర్టు ముందు న్యాయవాదులు నిరసన తెలిపారు. మెట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు పుప్పాల లింబాద్రి మాట్లాడుతూ ఖాసీంపై దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. బార్ ఉపాధ్యక్షులు రాంబాబు, న్యాయవాదులు శ్రీనివాస్, వెంకట నర్సయ్య, రాజ్ మహ్మద్, యుద్దవీర్ పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేరుస్తాం

మేడిపల్లి, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన హామీలను నేవేరుస్తామని వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని పోరుమల, కొండాపూర్ల గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. విప్ మాట్లాడుతూ 18 ఏళ్లుగా ఈ ప్రాంతంలో ఉంటున్నా, ఇక్కడి సమస్యలు తనకు తెలుసని, అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సాంకేతిక కారణంగా రుణమాఫీ కానీ రైతులకు రుణమాఫీ తప్పక చేస్తామని హామీ ఇచ్చారు. మాజీ సర్పంచ్ తౌటి తిరుపతిరెడ్డి, పాక్స్ చైర్మన్ శ్రీ నివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వినోద్ కుమార్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, రమేష్‌రెడ్డి, నాగరాజు, పాల్గొన్నారు.

రైతులతో గ్రామ సభలు

ఇబ్రహీంపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూలరాంపూర్ గ్రామ శివారులో నిర్మించిన బ్యాక్ వాటర్‌లో భూమి ముంపుకు గురువుతున్న రైతులతో మంగళవారం రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు మూలరాంపూర్, కోమటి కొండపూర్ గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించారు. అభ్యంతరాలు ఉంటే 60 రోజులలో ఆర్డీవో కార్యాయలంలో తెలుపాలన్నారు.

రేపు ఏఎంసీ పాలక వర్గం ప్రమాణ స్వీకారం

కథలాపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 28న వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏఎంసీ అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే విప్ ఆది శ్రీనివాస్ హాజరు కానున్నారని చెప్పారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలి

ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్



ధర్మపురిలో అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేస్తున్న విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా దళిత సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మంగళవారం ఆయన పాల్గొన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి ఆయన ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య-లక్ష్మణ్, దళిత సంఘాల నేతలు మొలుగూరి రమేష్, దొనకొండ నరేష్, కట్ల భువనేశ్వర్, చందోళి శ్రీనివాస్, బొల్లారపు పోచయ్య, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, పట్టణ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, రాందేని మొగిలి, బొంది లక్ష్మణ్, సుధాకర్‌రావు, పాల్గొన్నారు.

జగిత్యాల అగ్రికల్చర్: 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని స్థానిక తహశీల్‌చౌరస్తా వద్ద అంబేడ్కర్ విగ్రహానికి జగిత్యాల బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ పూ లమాల వేసి నివాళులు అర్పించారు.

●భారత సంవిధాన్ దివాస్‌ను పురస్కరించుకొని పట్టణంలోని స్థానిక ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాజ్యాంగ రక్షణకై ప్రతిజ్ఞ చేశారు. ప్రిన్సిపాల్ లిల్లీ మేరీ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ యతిరెడ్డి, మనోజ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

●పట్టణంలోని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నవంబరు 26 భారత సంవిధాన్ దివాస్‌ను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన వేడుకలకు జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్ఎస్ఎస్ అధికా రులు సంగీతరాణి, సుజాత, శ్రీలత పాల్గొన్నారు.

●జిల్లా పోలీసు కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడారు. సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు.

●పట్టణంలోని జ్యోతి హై స్కూల్, ఐఐటీ అకాడమీలో జాతీయ రాజ్యాంగ దినో త్సవాన్ని నిర్వహించారు. డైరెక్టర్‌లు హరిచరణ్ శ్రీధర్‌రావు, మౌనికరావు, రజితరావుతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

●భారతీయ జనతాపార్టీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపల్లి సత్యం అంబేడ్కర్ విగ్ర హానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.

కొడిమ్యాల : మండల కేంద్రంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి రాజ్యాంగ దినోత్సవాన్ని వివిధ పార్టీల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకుడు కొత్తూరి స్వామి, మల్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి, కొడిమ్యాల సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగరావు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగులు రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. సూపరింటెండెంట్ సురేందర్, సీనియర్ అసిస్టెంట్ సురేష్ సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేశారు.

జగిత్యాలరూరల్ : జగిత్యాల మండలం తిప్పన్నపేట గ్రామంలో అంబేడ్కర్ చౌరస్తా వద్ద మంగళవారం రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో మాలసంఘ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ చింతకుంట్ల గంగాధర్, అంబేడ్కర్ సంఘం మాజీ అధ్యక్షులు నీరటి వెంకటేష్, సీనియర్ మాల సంఘనాయకులు దేవయ్య, నా రాయణ పాల్గొన్నారు.

భీమారం: మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో భీమారం సొసైటీ చైర్మన్ కానుగంటి శ్రీనివాస్, మాజీ సర్పంచులు అంగడి ఆనంద్, కాటిపల్లి జగన్ రెడ్డి, నాయకులు బంగారు దీపక్ పాల్గొన్నారు.

పెగడపల్లి : భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పెగడపల్లి మండల కేంద్రంలో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు అంజయ్య, నాయకులు రాచర్ల సురేష్, మోదుంపల్లి అంజయ్య పాల్గొన్నారు.

కోరుట్ల: భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరు గౌరవించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో రాజ్యాంగ దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్ని అంబేడ్కర్ విగ్రహానికి నివాళ్లను అర్పించారు. ప్రజాసంఘాల జేఏసీ, అంబేడ్కర్ సంఘ నాయకులు రాజ్యాంగ దినోత్సవ వేడుకలో పాల్గొన్నారు.

మెట్‌పల్లి టౌన్: పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో, మెట్‌పల్లి మున్సిఫ్ కోర్టులో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిఫ్ కోర్టు అరుణ్‌కుమార్ న్యాయవాదులచే రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ చేయించారు. ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. బార్ అధ్యక్షులు పుప్పాల లింబాద్రి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రణయ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు భూమేశ్వర్ పాల్గొన్నారు.

మల్యాల: మల్యాలలోని బ్లాక్ చౌరస్తా వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి సంఘ సీనియర్ నాయకులు మ్యాక లక్ష్మన్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

దొంగ ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ప్రసాద్, వీరబత్తిని ప్రసాద్, తిరుపతి, చిన్నదుర్గయ్య పాల్గొన్నారు.

గొల్లపల్లి : మండలంలో రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఎంపీడీవో రాంరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ఏనుగు మల్లయ్య, ప్రత్యేకాధికారి పద్మ పాల్గొన్నారు.

వెల్గటూర్: ప్రపంచ దేశాలలో భారత రాజ్యాంగం గొప్పదని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ గౌతంరెడ్డి పేర్కొన్నారు. భారత రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందిచే ప్రతిజ చేయించారు. మండల పంచాయితీ అధికారి శ్రీనివాస్, సూపరిండెంట్ సూర్యారావు, సీనియర్ అసిస్టెంట్ నంది ప్రసాద్ బాబు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్ : జగిత్యాల మండలం తిప్పన్న పేట గ్రామంలో అంబేడ్కర్ చౌరస్తా వద్ద మంగళవారం రాజ్యాంగదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాలసంఘ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ చింతకుంట్ల గంగాధర్, అంబేడ్కర్‌సంఘం మాజీ అధ్యక్షులు నీరటి వెంకటేష్, లక్ష్మీనర్సయ్య, సీనియర్ మాల సంఘనాయకులు దేవయ్య, నారాయణ, తిరుపతి, రమేష్, ఎర్రండి గంగాధర్, నరేష్ పాల్గొన్నారు.

మల్లాపూర్ : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో మంగళవారం పలువురు అధికారులు, నాయకులు, యువకులు రాజ్యాంగ దినోత్సవం ఘనంగా జరిపారు. అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

రాయికల్: భారత రాజ్యాంగం విలువలను రక్షించాల్సిన బాధ్యత బాల, బాలికలపై ఉందని పాఠశాల సముదాయం ప్రధానోపాధ్యాయుడు కాపు శ్రీనివాస్ అన్నారు. రాయికల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

బాలికల్లో ఆత్మరక్షణకు కసరత్తులు..

(5వ పేజీ తరువాయి)

ఆడబిడ్డల రక్షణకు కరాటే రక్షణ కవచంగా నిలుస్తుంది. ఆడబిడ్డల రక్షణ కోసం, ఆరోగ్యవంతమైన సమాజం కోసం కరాటే ఎంతగానో తోడ్పాటును అందజేస్తుంది. కరాటేలో కటాస్, స్పారింగ్ అనే రెండు భాగాలు, ఇందులో పూర్తిగా పంచ్‌లు, కిక్స్, బ్లాకింగ్స్, త్రోస్, లాక్స్, మూవింగ్ జంప్స్, బ్రేకింగ్స్, కర్ర స్టంట్స్ వంటి మూమెంట్స్ శిక్షణను ఇవ్వనున్నారు.

ప్రతిరోజు 45 నిమిషాల పాటు...

బాలికలకు కరాటే నేర్పేందుకు శిక్షకులైన కరాటే మాస్టర్లను విద్యాశాఖ అధికారులు ఎంపిక చేశారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 30 మంది కరాటే మాస్టర్లను నియమించారు. ప్రతీ మాస్టర్‌కు ప్రతీ నెల రూ. 5 వేల గౌ రవ వేతనం ప్రభుత్వం ఇస్తుంది. పాఠశాలలో వారానికి మూడు రోజుల పాటు కరాటే క్లాస్‌లు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ 45 నిమిషాల పాటు కరాటే శిక్షణ ఇస్తున్నారు.



●కరాటేను కోర్సుగా ప్రవేశపెట్టాలి
పర్త ఆకాశ్, కరాటే మాస్టర్, జగిత్యాల

ససమాజంలో అమ్మాయిలపై జరిగే అఘాత్యాలను రూపు మాపేందుకు కరాటే ఉపయోగపడుతోంది. స్కూల్ స్థాయి నుంచే అమ్మాయిలకు మార్షల్ ఆర్ట్స్ అందించడం ద్వారా వారికి రక్షణ కవచంగా నిలుస్తోంది. ఎదుటి వారిని నిర్భయంగా ఎదుర్కోవచ్చు. ప్రభుత్వ పాఠశాలల్లో మూడు నెలలే కాకుండా కరాటే కోర్సును ప్రవేశపెడితే అమ్మాయిలకు పూర్తి స్థాయిలో న్యాయం చేసినట్లు అవుతుంది.



●శిక్షణ ఉపయోగకరంగా ఉంది
తనుశ్రీ, 9వ తరగతి విద్యార్థిని, జడ్‌పీహెచ్ఎస్, మెట్‌పల్లి

కరాటే శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఆత్మవిశ్వాసంతో పాటు ఆత్మ రక్షణకు ఈ విద్య ఎంతో తోడ్పడుతుంది. వారానికి మూడు సార్లు మాస్లర్ శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ ముందు కంటే ప్రస్తుతం మాలో ఆత్మ విశ్వాసం పెరిగింది. ఆత్మరక్షణకు ప్రభుత్వం కరాటే శిక్షణ నిరంతరం ఇవ్వడంతో పాటు బాలికల రక్ష ణకు చర్యలు తీసుకోవాలి.



●బాలికలకు కరాటే అవసరం
జగన్ మోహన్ రెడ్డి, డీఈవో

బాలికలకు విద్యతో పాటు కరాటే ఎంతో అవసరం. ఏదైనా ఘటన జరిగినప్పుడు తనను తాను కాపాడుకోవడానికి కరాటే ఎంతో అవసరం. పాఠశాల స్థాయి నుంచే కరాటేపై నైపుణ్యం పెంపొందుతుంది. ఈ శిక్షణ ద్వారా బాలికల్లో ఆత్మ స్థయిర్యం, ధైర్యం పెరుగుతుంది. ప్రభుత్వం కల్పించే ఈ అవకాశాన్ని బాలికలు సద్వినియోగం చేసుకోవాలి. జిల్లా వ్యాప్తంగా 3 నెలల పాటు కరాటే శిక్షణ ఉంటుంది.

గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

- మార్కెట్‌కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి

కోరుట్ల రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వతోనే సాధ్యమని కోరుట్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని దర్మారం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం గ్రామంలో అంగన్‌వాడి భవన నిర్మాణానికి రూ. 12 లక్షల నిధులు మంజూరు చేయడాన్ని స్వాగతిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, కోరుట్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు చిత్రపటాలకు అంగన్‌వాడి టీచర్లతో పాటు కాంగ్రెస్ నాయకులతో కలిసి క్షీరాభిషేకం చేశారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి

జిల్లా అడిషనల్ కలెక్టర్ బిఎస్ లత

జగిత్యాలరూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని జగిత్యాల అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత అన్నారు. తిప్పన్నపేట ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దళారులకు రైతులు ధాన్యాన్ని విక్రయించవద్దని, ప్రభుత్వం ద్వారా ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. తేమశాతం 17 లోపు ఉన్న ధాన్యాన్ని తూర్పారపట్టాలని అన్నారు.

●రైతుల చెల్లింపులు ఆన్‌లైన్‌లో వెంటనే నమోదు చేయాలని జిల్లా సెర్ప్ ఫైనాన్స్ డీపీఎం విజభారతి అధికారులను ఆదేశించారు. మంగళవారం జగిత్యాల మండలం తిప్పన్నపే, ధరూర్, అంబారిపేట, గోపాల్‌రావుపేట, రూరల్ మండలం అంతర్గాం, తాటిపల్లి గ్రామాల్లోని ఐకేపీ వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ఏపీఎం గంగాధర్, ఏఈఓలు పాల్గొన్నారు.



తిప్పన్నపేట ఐకేపీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అడిషనల్ కలెక్టర్ లత

చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

మెట్‌పల్లి డీఎస్పీ అడ్లూరి రాములు

మెట్‌పల్లిటౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సమాజంలో అల్లర్లు సృష్టించి, చట్ట వ్యతిరేఖ కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని మెట్‌పల్లి డిఎస్పీ అడ్లూరి రాములు రౌడీషీటర్లను హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో సర్కిల్ పరిధిలోని, మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలంలో వివిధ మర్డర్ కేసులు, ల్యాండ్ సెటిల్మెంట్, ఇసుక, చట్టావ్యతిరేఖ కార్యక్రలాపాలకి పాల్పడిన 44 మంది రౌడీ షీటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ రాములు మాట్లాడుతూ ఇక నుంచి ఎవరు కూడ చట్టా వ్యతిరేఖ పనులకి పాల్పడిన, సెటిల్మెంట్‌ల పేరులతో సామాన్య ప్రజలని వేధించిన చట్టారీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, మల్లాపూర్ ఎస్ఐ కిరణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న మెట్‌పల్లి డీఎస్పీ

ఇదేం మధ్యాహ్న భోజనం..

● గురుకులంలో వంటపై ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆగ్రహం

రాయికల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని అల్లీపూర్ గ్రామంలో గల మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంటశాలను పరిశీలించారు. అన్నం పరిశీలించి ఏ మాత్రం ఉడకలేదని నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పలుచగా ఉన్న పప్పు, నీళ్లలాగా ఉన్న రసం చూసి ఇవేం వంటకాలు అని అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులకు వారానికి 5 గుడ్లు ఇవ్వాల్సింది పోయి కనీసం రెండు గుడ్లు కూడా ఇవ్వడం లేదని, మాంసం కూడా సరిగా అందివ్వకపోవ డంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ రోజు టిఫిన్ ఏం పెడుతున్నారు, మాంసం, గుడ్లు ఎన్ని సార్లు ఇస్తున్నారని అడిగి తెలుసు కున్నారు. విద్యార్థులు ఇవ్వడం లేదని చెప్పడంతో కాంట్రాక్టర్, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎంతో ఖర్చు పెట్టి పిల్లలకు భోజనానికి డబ్బు వెచ్చిస్తుంటే దాంట్లో ఎందుకు కోత పెడుతున్నారని నిర్వాహకులను ప్రశ్నించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఎమ్మెల్సీ ఫిర్యాదు చేసారు. పాఠశాలలో విద్యార్థులకు నాణ్యత లేని ఆహారాన్ని అందిస్తున్నారని, నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను సవరించాలి

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్

జగిత్యాల అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు వ్యతిరేక బడ్జెట్‌ను సవరించాలని, లేబర్ కోర్సును రద్దు చేసి కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని, ఉపాధి పథకం పనిని 200 రోజులు పెంచి కూలీ రూ. 600 ఇవ్వాలని, రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ జాతీయ కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా, వ్యవసాయ కార్మిక సంఘం ఐక్యంగా ఇచ్చిన పిలుపు మేరకు జగిత్యాల చౌరస్తా వద్ద కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి చింతమనేశ్వర్, పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ

వెల్గటూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగదేవ్‌పేట గ్రామానికి మంజూరు అయిన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి మంగళవారం భూమి పూజ నిర్వహించి తహసీల్దార్ శేఖర్ చేతుల మీదుగా శిలాఫలకం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం, పంచాయితీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద జగదేవ్‌పేట అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.12 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూవో నరేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తాటిపర్తి శైలేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గోల్ల తిరుపతి, మండల పంచాయితీరాజ్ శాఖ ఏఈ రాజు, అంగన్వాడి ఐసీడీ ఎస్ సూపర్‌వైజర్ ఆండాలు, గ్రామ శాఖ అధ్యక్షుడు తిరుపతి, ఏఎంసీ డైరెక్టర్లు పాల్గొన్నారు

వసతి గృహాల తనిఖీ

ధర్మపురి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని పట్టణంలోని ప్రభుత్వ వసతి గృహాలను వైద్యాధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు వైద్యాధికారులు స్థానిక కేజీబీవీ బాలికల స్కూల్, మైనార్టీ రెసిడెన్సియల్ స్కూల్, కళాశాల వసతి గృహాలు, ఎస్సీ ఎస్టీ, బీసీ బాలుర వసతి గృహాలను సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ వివేక్, డాక్టర్ వినయ్, సీహెచ్‌వోలు శ్రీనివాస్, శాంతిశ్రీ, ఎంసీహెచ్ఈవో సతీష్‌కుమార్, పాల్గొన్నారు.

డాటా ఎంట్రీ పకడ్బందీగా చేపట్టాలి

● ఇంటింటి సర్వే డాటా ఎంట్రీని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

మెట్‌పల్లిటౌన్, నవంబర్ 26(ఆంధ్రజ్యోతి):ఇంటింటి సర్వే డాటా ఎంట్రీని పకడ్బందిగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. మంగళ వారం పట్టణంలోని మున్సిపల్ కార్యలయంలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే డాటా ఎంట్రిని ఆయన ఆకస్మికంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ఎంట్రీ చేస్తున్న వివరాలను పక్కగా చేయాలని కంప్యూటర్ అపరేటర్‌లకు సూచించారు. తప్పులు లేకుండా ఎంట్రీ చేయాలని అన్నారు. ఎమైన సందేహాలు ఉంటే టెక్నికల్ టీం దృష్టికి తీసు కెళ్లాలని తెలిపారు. కమిషనర్ మోహన్, తహసీల్దార్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

కోరుట్ల రూరల్ : విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ సత్యప్రసాద్ విద్యా శాఖ అధికారులను హెచ్చరించారు. మండలంలోని యూసుఫ్‌నగర్ గ్రామంలోని జిల్లాపరిషత్ పాఠశాలను కలెక్టర్ సత్యప్రసాద్ అకస్మికంగా తనిఖీ నిర్వహించారు. పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థుల హజరుశాతంపై ఆరా తీసారు. విద్యార్థులకు ఏర్పాటు చేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వహణను పరిశీలించి అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులకు అందించే బోజన వివరాలు సక్రమంగా తెలియని ఉపాధ్యాయుడు విద్యార్థులకు విద్యా బోధన ఎలా చేస్తున్నావని ప్రశ్నించారు. ఎంఈవో నరేశం పాల్గొన్నారు.



విద్యార్థులకు అందించే మెనూను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

'ఉపాధిహామీ'ని సద్వినియోగం చేసుకోవాలి

● డీఆర్‌డీవో, పీడీ రఘువరన్

మెట్‌పల్లి రూరల్, నవంబర్, 26 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రైతులకు అందజేస్తున్న యూనిట్‌లను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీవో, పీడీ రఘువరన్ అన్నారు. మంగళవారం మండలంలోని వేంపేట గ్రామంలో ప్రజాపాలన ప్రజా విజయోత్సవం, రాజ్యాంగ దినోత్సవ కార్యాక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఉపాధిహామీ పథకంలో గ్రామానికి చెందని ఏలేటి శంకర్‌కు మంజూరైన పశువుల పాక నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. గ్రామంలోని అభివృద్ధి పనులకు రూ. 50లక్షలు మంజూరు చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి ఆయనకు వినతి పత్రం అందజేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అశోక్, ఫీల్డ్అసిస్టెంట్ రాము ఉన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

రాయికల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ నిర్వహిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి అన్నారు. జగిత్యాల లయన్స్ క్లబ్ మెంబర్, కిష్టంపేట మాజీ సర్పంచ్ లయన్ తంగెళ్ళ రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. శిబిరంలో 130 మందికి రేకుర్తి కంటి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించగా 85 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేసి రేకుర్తి కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తాటిపాముల వినోద్ కుమార్, సింగ్రావుపేట మాజీ సర్పంచ్ జయశ్రీ కృష్ణమూర్తి, అల్లీపూర్ మాజీ సర్పంచ్ గంగారెడ్డి, పాల్గొన్నారు.

సీఎం సలహాదారుడిని కలిసిన ఏఎంసీ చైర్మన్

మెట్‌పల్లి రూరల్, నవంబర్, 26 (ఆంధ్రజ్యోతి) : ముఖ్య మంత్రి సలహాదారుడు నరేందర్‌రెడ్డిని కలిసిన మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ కూన గోవర్దన్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో టీపీసీసీ డెలిగేట్ మెంబర్ కల్వకుంట్ల సుజిత్‌రావుతో కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువతో ఘనంగా సన్మానించారు. నాయకులు వాకిటి సత్యంరెడ్డి, వెంకటగిరి, మహబూబ్, పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

● కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



గురుకుల పాఠశాలలోని సమస్యలను తెలుసుకుంటున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లిరూరల్, నవంబర్, 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల ఆహార విషయంలో నిర్లక్ష్యం చేయకుండా మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వ కుంట్ల సంజయ్ నిర్వహకులకు సూచించారు. మంగళవారం మండలంలోని పెద్దాపూర్ గ్రామ శివారులోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురు కుల పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురుకులంలోని భోజనశాల, సరకులు, కూరగాయాలు పరిశీలించారు.

వంటలు, విద్యార్థులకు అందజేస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం, అల్పాహారం, మౌలికవసతులు, పాఠాలు ఎలా సాగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. నాయకులు, ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.

వెల్లుల్లలో అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

నియోజకవర్గంలో చదువుతున్న పేద విద్యార్థుల చదువుకు తనవంతు చేయూతను అందించేందుకు ముందుంటానని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. నియోజకవర్గంలోన ప్రైవేట్ డ్రైవర్ తుమ్మ రాజేశం కుమార్తె అక్షిత ఎంబీబీఎస్ సీట్ సాధించడంతో మంగళవారం ఆమె చదువుకోసం రూ.30వేల నగదుతో పాటు బుక్స్‌ను అందజేశారు. అనంతరం జగ్గసాగర్ గ్రామంలోని సారా గంగారెడ్డి ఇల్లు కాలిపోవడంతో వారికి రూ. 10వేలు అందించారు. పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మారు సాయిరె డ్డి, ఎల్ఎస్‌సీఎస్ మాజీ చైర్మన్ మార్ మురళీధర్‌రెడ్డి, పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

జగిత్యాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన నిర్వహణ సక్రమంగా లేదనే సాకుతో ఉపాధ్యాయులను బాధ్యులను చేస్తూ సస్పెన్షన్ చేయవద్దని కోరుతూ పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు మంగళవారం కలెక్టర్, డీఈవోను కలిసి వినతిపత్రం సమర్పించారు.

కొడిమ్యాల: మాలల హక్కుల సాధనకు ఉద్య మించాలని ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కాయిత శంకర్ పిలుపు నిచ్చారు. మంగళవారం రాంసాగర్ గ్రామంలోని మాల సంఘ భవనంలో మాలల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

మల్లాపూర్ : అర్హులైన ప్రతి ఒక్కరు ఉపాధి హామీ పథకం సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో జగదీష్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ముత్యంపేట గ్రామంలోని ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైయిన నూరజహాన్ పశువుల షెడ్డు నిర్మాణానికి అధికారులు, భూమి పూజచేశారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన పుప్పాల రమ్య (19) అనే యువతి పెళ్లి చేసుకోవడం ఇష్టం లేక ఉరి వేసుకోని ఆత్మహత్య చేసుకున్నట్లు ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్ తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోరుట్ల : అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని మెట్‌పల్లి డీఎస్పీ అడ్డూరి రాములు అన్నారు. మంగళవారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో కోరుట్ల సర్కిల్ పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ కేసుల వివరాలను తెలుపుతూ అవగాహన కల్పించారు.

మల్యాల: ప్రజాపాలన విజయోత్సవా లలో భాగంగ మంగళవారం మల్యాల నుంచి గుడిపేట వరకు రూ.1.35కోట్లతో చేపట్టిన రోడ్డు పనులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. ఎంపీడీవో స్వాతి, తహసీల్దార్ మునీందర్ పీఆర్ ఏఈలు జ్ఞానేశ్వర్, ఇబ్రహీం కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మల్యాల: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయకుండానే ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించడం ప్రజలను తప్పుదారి పట్టించడానికేనని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బింగి వేణు అన్నారు. మ్యాడంపల్లిలో మాట్లాడుతూ ప్రభుత్వం గారడి మాటలతో ప్రజలను మోసం చేస్తుందని విమర్శించారు.

●మధ్యాహ్న భోజన నిర్వహణలో ఉపాధ్యాయులను బాధ్యులు చేయడం సరికాదని స్టేట్ టీచర్స్ యూ నియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మచ్చ శంకర్, భైరం హరికిరణ్ అన్నారు. పలు పాఠశాలల్లో మంగళవారం ఎస్టీయూ సభ్యత్వ నమోదు చేపట్టారు.